తెలంగాణ

# వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :64 | 19-09- 2026 | శనివారం | పేజీలు: 4 | వెల:03/-


# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

**పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు సంచలన తీర్పు**
**స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టిన ధర్మాసనం**
**2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు**
**ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ**



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. దానం నాగేందర్ అనర్హతపై గతంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇచ్చిన నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టింది. చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపుల నిరోధక నిబంధనల ప్రకారం దానం నాగేందర్ అనర్హతకు గురైనట్లు కోర్టు పేర్కొంది. ఆయనపై అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని తాజా న్యాయస్థాన నివేదికలు వెల్లడించాయి.

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి..
కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ

2

# ఎల్‌నినోతో వర్షాభావం.. కేంద్ర సాయం కోరిన సీఎం రేవంత్

**రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం**
**విద్యుత్, తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు**
**గ్రామీణ గృహాల మంజూరులో రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని వినతి**



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు శివరాజ్‌సింగ్ చౌహాన్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను కలిసి రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు.
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంపై పడుతున్న ప్రభావం, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. సాధారణ

2

# యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా!

- అధికారుల ఉదాసీనతతో పక్కదారి పడుతున్న సహజ వనరులు!
- జాతీయ రహదారి పక్కనే ఉన్న చిట్యాల వాగులో 'మాఫియా' రాసలీలలు
- అక్రమ సంపాదనకు అలవాటుపడి మామూళ్ల మత్తులో మౌనం వహిస్తున్న అధికారులు?
- వివిధ గ్రామాల్లో అక్రమ డంపింగ్‌లు -- నిల్వ చేసి అధిక ధరలకు విక్రయం
- ట్రాక్టర్ ట్రిప్పుకు రూ. 8,000 నుండి రూ. 10,000 వరకు అడ్డగోలు దోపిడీ



5

# నా జీవితం తెరిచిన పుస్తకం.. భూములు చూసేందుకు ఇంత హంగామా ఎందుకు?

- బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, డ్రోన్లు, వేలాది మంది పోలీసుల పహారా అవసరమా?
- నేరుగా ఇంటికి వస్తే కడుపునిండా భోజనం పెట్టి.. నా తోటంతా చూపిస్తా
- ఎన్నికల అఫిడవిట్లలో నా ఆస్తుల వివరాలన్నీ స్పష్టంగా ఉన్నాయి: హరీశ్‌రావు



5

# ఫార్ములా-ఈ కేసు.. నాంపల్లి కోర్టుకు కేటీఆర్

**రూ.55 కోట్ల వ్యవహారంపై ఏసీబీ ఛార్జ్‌షీట్**
**కోర్టుకు హాజరైన మాజీ మంత్రి**
**తదుపరి విచారణ అక్టోబర్ 30కి వాయిదా**




హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌కు సంబంధించిన విచారణలో భాగంగా ఆయన కోర్టుకు వచ్చారు. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, మాజీ హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు తదితరులు కూడా నిందితులుగా ఉన్నారు.

5

# మద్యం నిషేధంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**నిషేధంతో అక్రమ మద్యం, డ్రగ్స్ పెరిగే ప్రమాదం.. ఐదు అంశాలపై ధర్మాసనం దృష్టి**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (తెలంగాణ వెన్నెల వాక్కు): మద్యం నిషేధ చట్టాల ప్రభావంపై సుప్రీంకోర్టు శనివారం కీలక వ్యాఖ్యలు చేసింది. మద్యం నిషేధం అమలుతో ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడటంతో పాటు, నిషేధాన్ని అమలు చేయడానికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని ధర్మాసనం పేర్కొంది. అదే సమయంలో అక్రమ మద్యం తయారీ, విక్రయాలు పెరిగే అవకాశం, పోలీసు వ్యవస్థలో అవినీతికి అవకాశాలు ఏర్పడటం వంటి అంశాలను కూడా పరిశీలించింది.
మద్యం నిషేధం ఉన్న ప్రాంతాల్లో అక్రమంగా తయారయ్యే మద్యం కారణంగా విషాద ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలను కూడా కోర్టు ప్రస్తావించింది. నిషేధం లక్ష్యాలను సాధిస్తుందా లేదా అనేది పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం వ్యాఖ్యల ద్వారా స్పష్టమైంది. మద్యం నిషేధం వల్ల ఎదురయ్యే సామాజిక, ఆర్థిక, పరిపాలనా ప్రభావాలపై సమగ్రంగా పరిశీలన అవసరమని కోర్టు సూచించింది. నిషేధ చట్టాల అమలు, వాటి వల్ల ఏర్పడే అనుబంధ సమస్యలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# రాజ్యాంగంపై దాడికి 'హైకోర్టు' చెక్

## రాజకీయం నాటకం కాకూడదు!



రాజకీయ స్వార్థం, అధికార దాహం, పార్టీ ఫిరాయింపులు... తెలంగాణ రాజకీయాల్లో ఇవి కొత్త విషయాలేమీ కావు. కానీ, ప్రజాస్వామ్య వ్యవస్థలను, జనాదేశాన్ని అంగడి సరుకుగా మార్చే ఈ అనైతిక క్రీడ ఎంతటి ప్రమాదకర స్థాయికి చేరిందో చెప్పడానికి ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలే సజీవ సాక్ష్యం. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై, ఆ పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఓట్లేసిన ప్రజల తీర్పును బొందపెట్టి, కనీస రాజకీయ నైతికతను విస్మరించి అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యేల వ్యవహారంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు ఒక చారిత్రాత్మక ఘట్టం.

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు చట్టసభలను, స్పీకర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని రాజకీయ నాటకాలాడుతున్న నాయకులకు ఒక తీవ్రమైన హెచ్చరిక. ఇది కేవలం ఒక వ్యక్తికి తగిలిన ఎదురుదెబ్బ మాత్రమే కాదు; రాజ్యాంగ వ్యవస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకోవాలనుకునే రాజకీయ పార్టీలకు, స్పీకర్ స్థానంలో ఉండి నిష్పాక్షికతను తుంగలో తొక్కిన చట్టసభల అధిపతులకు పడిన చెంపపెట్టు!

ఒకేసారి 10 మంది ఎమ్మెల్యేలు గోడ దూకినప్పుడు, కేవలం ఒక్క దానం నాగేందర్‌పైనే కోర్టు అనర్హత వేటు ఎందుకు వేసిందనే ప్రశ్న కొందరు రాజకీయ పండితులకు, విశ్లేషకులకు రావడం విడ్డూరం. 'పది మంది కలిసి తప్పు చేస్తే, ఒక్కడిపైనే చర్యలు తీసుకోవడం ఏ రకమైన న్యాయం?' అని ప్రశ్నించడం చట్ట ప్రాథమిక సూత్రాలనే పరిహసించడమే అవుతుంది. దానం నాగేందర్ చేసినది సాదాసీదా ఫిరాయింపు కాదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా రాజీనామా చేయకుండా, తన సభ్యత్వానికి వీడ్కోలు పలక్కుండానే, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అధికారిక 'బి-ఫారమ్' అందుకుని, బహిరంగంగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో ఎంపీగా పోటీ చేశారు. ఇది రాజ్యాంగం ముక్కు చెక్కినంత పచ్చి ఫిరాయింపు! ఒక పార్టీ ఎమ్మెల్యేగా ప్రజాధనం నుంచి జీతం, హోదా, అధికారిక సదుపాయాలు అనుభవిస్తూ... మరొక పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిగా నిలబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను, ఆయనను గెలిపించిన ఖైరతాబాద్ ప్రజలను దారుణంగా మోసగించడం కాదా? ఇది అక్షరాలా చట్టాన్ని ఎగతాళి చేయడమే.

ఇక్కడ అసలైన నైతిక విచ్ఛిత్తి ఎక్కడుందంటే... స్పీకర్ స్థానంలో ఉన్న రాజ్యాంగ వ్యవస్థ తీరులోనే! స్పీకర్ పదవి అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకో, అధికార పక్షానికో సంబంధించినది కాదు. అదొక పవిత్రమైన రాజ్యాంగబద్ధ పీఠం. ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆధారాలతో సహా స్పీకర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, దానం నాగేందర్ పార్టీ మారినట్లు 'సరిపడా ఆధారాలు లేవు' అంటూ ఆ ఫిర్యాదులను స్పీకర్ కొట్టివేయడం ఏ రకమైన ప్రజాస్వామ్య ధర్మం? కళ్లముందే మరొక పార్టీ బీ-ఫారమ్‌పై ఎంపీగా పోటీ చేసిన ఆధారాలు స్పష్టంగా కనిపిస్తుంటే, 'ఆధారాలు లేవు' అని దాటవేయడం స్పీకర్ స్థానానికి ఉన్న పవిత్రతను నీరుగార్చడం కాదా? రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ తెచ్చింది ఫిరాయింపులను ప్రోత్సహించడానికి కాదు, వాటిని అరికట్టడానికి! కానీ, నేటి రాజకీయాల్లో స్పీకర్‌లు తమ సొంత పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం విచారణలను నాన్చడం, ఫిర్యాదులను చెత్తబుట్టలో వేయడం ఒక అలవాటుగా మారింది. అందుకే, సహనం నశించిన ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని, స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఆయన ఉత్తర్వులపై స్టే విధించాల్సి వచ్చింది. "మిగిలిన 9 మంది ఎమ్మెల్యేలకు ఏది న్యాయం? వారిని ఎందుకు అనర్హులుగా ప్రకటించలేదు?" అని ప్రశ్నించే వారు న్యాయస్థానాల పనితీరును, చట్టపరమైన ప్రక్రియను అర్థం చేసుకోవాలి. కోర్టులు భావోద్వేగాలతోనో, రాజకీయ ప్రసంగాలతోనో పనిచేయవు; అవి పక్కా ఆధారాల ప్రాతిపదికన పనిచేస్తాయి. దానం నాగేందర్ కేసులో 'కాంగ్రెస్ బి-ఫారమ్' అనే తిరుగులేని, తిరస్కరించలేని సాక్ష్యం సిద్ధంగా ఉంది కాబట్టి, న్యాయస్థానం కాలయాపన చేయకుండా 2024 ఏప్రిల్ నుంచే ఆయనను శాసనసభ్యుడిగా అనర్హుడిగా ప్రకటించింది. మిగిలిన 9 మంది విషయంలో కూడా విచారణలు జరుగుతున్నాయి. వారు చట్టం నుంచి తప్పించుకున్నారని లేదా వారికి మినహాయింపు లభించిందని భావించడం అజ్ఞానమే అవుతుంది. దానం నాగేందర్ కేసులో వచ్చిన ఈ తీర్పు రాబోయే మిగిలిన 9 కేసులకు ఒక మార్గదర్శక సూత్రంగా (ప్రతీవఏవనవత్) నిలుస్తుంది. ఇది న్యాయస్థానం వెనకడుగు వేయడం కాదు; చట్టపరమైన ప్రక్రియలను పద్ధతి ప్రకారం, హేతుబద్ధంగా అమలు చేయడం!

ప్రజాస్వామ్యంలో ఓటర్లను కేవలం ఓటు బ్యాంకుగా చూసే నాయకులకు ఈ తీర్పు ఒక పెద్ద కనువిప్పు కావాలి. ఒక పార్టీ సిద్ధాంతాలు, గుర్తుపై ప్రజల ఓట్లు పొంది గెలిచిన తర్వాత, స్వార్థ ప్రయోజనాల కోసం, పదవుల కోసం వేరే పార్టీలోకి దూకడం ప్రజల తీర్పును దారుణంగా అవమానించడమే. ఒక ఎమ్మెల్యే పై అనర్హత వేటు పడితే ప్రజలకు న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించే వారు గుర్తుంచుకోవాలి--- రాజకీయ అక్రమాలను, చట్ట ఉల్లంఘనలను సహించకపోవడమే ప్రజలకు జరిగే నిజమైన న్యాయం. చట్టం ముందు అందరూ సమానులే, ఏ అధికార పక్షమూ రాజ్యాంగానికి అతీతం కాదు అనే బలమైన సంకేతం ప్రజల్లోకి వెళ్లినప్పుడే వ్యవస్థలపై గౌరవం పెరుగుతుంది.

ఈ తీర్పును ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్య పునరుద్ధరణగా, రాజ్యాంగ విజయంగా స్వీకరించాలి. అధికారంలో ఉన్న పార్టీలు చట్టసభల నియమాలను, స్పీకర్ వ్యవస్థను తమ రాజకీయ లబ్ధి కోసం అడ్డగోలుగా వాడుకోవడం ఇకనైనా స్వస్తి పలకాలి. స్పీకర్ పదవిలో ఉన్నవారు తాము అధికార పార్టీ కార్యకర్తలు కాదని, రాజ్యాంగ రక్షకులమని గుర్తించాలి. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఈ సంచలన తీర్పు, దేశంలోనే ఫిరాయింపు రాజకీయాలకు ముగింపు పలకడానికి ఒక బలమైన పునాదిగా మారుతుంది. అధికారం ఉంది కదా అని రాజ్యాంగాన్ని, ప్రజా తీర్పును బంతిలా ఆడుకోవాలని చూస్తే, న్యాయవ్యవస్థ కొరడా ఝుళిపిస్తుందని ఈ తీర్పు స్పష్టం చేసింది. ఇకనైనా రాజకీయ నాయకులు సాకులు చెప్పడం ఆపి, నైతిక విలువల బాటలో పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# అష్టమి అంటే అశుభమేనా..

## ఆ రోజు ఏం చేయాలి? ఏం చేయకూడదు?

పంచాంగంలో అష్టమి తిథి కనిపిస్తే చాలు.. కొందరు 'ఈ రోజు మంచిది కాదు' అంటూ ముఖ్యమైన పనులను వాయిదా వేస్తుంటారు. మరికొందరు ఆలయానికి వెళ్లడానికీ సంకోచిస్తారు. అసలు అష్టమి తిథికి అంతటి భయం ఎందుకు? అష్టమి రోజున నిజంగా ఏ పనులు చేయకూడదు? వివాహం, గృహప్రవేశం వంటి శుభకార్యాలు చేయవచ్చా? అనే ప్రశ్నలకు సంప్రదాయంలో ప్రత్యేకమైన వివరణ ఉంది.చంద్రుడు సూర్యుడి నుంచి 90 నుంచి 102 డిగ్రీల మధ్య ఉన్న కాలాన్ని అష్టమి తిథిగా పంచాంగం పేర్కొంటుంది. ప్రతి పక్షంలో ఒక అష్టమి చొప్పున శుక్లపక్ష అష్టమి, కృష్ణపక్ష అష్టమి వస్తాయి. అంటే నెలలో రెండు అష్టమి తిథులు ఉంటాయి. అష్టమి అనేది స్వయంగా అశుభమైన తిథి అని చెప్పడం మాత్రం సరైనది కాదు. శ్రీకృష్ణ జన్మాష్టమి, దుర్గాష్టమి వంటి పవిత్ర పర్వదినాలు అష్టమి తిథినే వస్తాయి. అయితే వివాహం వంటి శుభకార్యాల విషయంలో అష్టమిని సాధారణంగా ఎందుకు దూరంగా ఉంచుతారు? సంప్రదాయ ముహూర్త శాస్త్రంలో వివాహం, ఉపనయనం, గృహప్రవేశం, శంకుస్థాపన వంటి ముఖ్యమైన శుభకార్యాలకు అనుకూలమైన తిథులు, నక్షత్రాలు, వారాలు, లగ్నాలు, యోగాలు, కరణాలు తదితర పంచాంగ అంశాలను పరిశీలిస్తారు. ఈ పరిశీలనలో అష్టమి సాధారణంగా వివాహాది ముహూర్తాలకు ప్రాధాన్యత పొందదు. అందుకే 'అష్టమి రోజు పెళ్లి చేయకూడదు' అనే సంప్రదాయం బలపడింది.గృహప్రవేశం విషయంలోనూ ఇదే విధంగా ముహూర్తాన్ని పరిశీలించడం ఆనవాయితీ. కొత్త ఇంట్లోకి ప్రవేశించడం జీవితంలో ఒక ముఖ్యమైన శుభకార్యంగా భావిస్తారు కాబట్టి, కేవలం తిథిని చూసి కాకుండా పూర్తి పంచాంగాన్ని పరిశీలించి ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. అందువల్ల సాధారణంగా అష్టమి తిథిలో గృహప్రవేశాన్ని ఎంచుకోకుండా, అనుకూలమైన ముహూర్తాన్ని పండితుల సూచనతో నిర్ణయించుకోవడం సంప్రదాయబద్ధమైన పద్ధతి.

అయితే 'అష్టమి రోజు ఏ పని చేయకూడదు' అని భావించడం మాత్రం అపోహ. నిత్యపూజలు, దేవతారాధన, ఆలయ దర్శనం, జపం, పారాయణం, దానం వంటి ధార్మిక కార్యక్రమాలను అష్టమి వచ్చిందని ఆపాల్సిన అవసరం లేదు. భక్తుడు ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోవచ్చు. తనకు సాధ్యమైన విధంగా పూజ చేసుకోవచ్చు. ముఖ్యంగా కొన్ని అష్టమి తిథులకే ప్రత్యేక దేవతారాధన ప్రాధాన్యత కూడా ఉంది. అష్టమి పట్ల భయం రావడానికి మరో కారణం కొన్ని ప్రాంతాల్లో, కొన్ని కుటుంబ సంప్రదాయాల్లో ఈ తిథిని శుభకార్యాలకు అనుకూలంగా పరిగణించకపోవడమే. ఒక ఆచారం క్రమంగా ప్రజల్లోకి వచ్చినప్పుడు దాని వెనుక ఉన్న ముహూర్త నియమం మరిచిపోయి, 'అష్టమి అంటే చెడు' అనే భావన ఏర్పడుతుంది. కానీ తిథి అనేది శుభం, అశుభం అనే ఒక్క మాటతో నిర్ణయించాల్సిన విషయం కాదు.ఒక ముఖ్యమైన విషయాన్ని భక్తులు గుర్తుంచుకోవాలి. అష్టమి రోజున దేవుడి దర్శనం చేయకూడదు అనే నియమం లేదు. పైగా జన్మాష్టమి, దుర్గాష్టమి వంటి సందర్భాల్లో లక్షలాది మంది భక్తులు అదే తిథిన దేవతలను ప్రత్యేకంగా ఆరాధిస్తారు. కాబట్టి అష్టమిని చూసి భయపడటం కంటే.. ఆ రోజు ఏ కార్యానికి ఏ విధమైన ముహూర్తం అనుకూలమో తెలుసుకోవడం మంచిది.వివాహం, గృహప్రవేశం, శంకుస్థాపన వంటి జీవితంలో ఒక్కసారి లేదా ముఖ్యంగా నిర్వహించే శుభకార్యాలకు మాత్రం పంచాంగం, కుటుంబ ఆచారం, ముహూర్తం వంటి అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం సముచితం. ఒకే తిథి ప్రతి ప్రాంతంలో, ప్రతి సంప్రదాయంలో ఒకే విధంగా పరిగణించబడుతుందని కూడా చెప్పలేం.అందుకే అష్టమి అంటే భయం కాదు.. అవగాహన అవసరం. దేవుడి సన్నిధికి వెళ్లడానికి భక్తికి తిథి అడ్డంకి కాదు. కానీ ముఖ్యమైన శుభకార్యానికి మాత్రం సరైన ముహూర్తాన్ని ఎంచుకోవడం మన సంప్రదాయం. అష్టమి తిథిని అర్థం చేసుకుని ఆచరిస్తే.. భయం తొలగిపోతుంది, భక్తి మరింత పెరుగుతుంది.ఆలయ గడప దాటే ప్రతి భక్తుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి.. తిథిని భయపడటం కాదు.. తిథి ధర్మాన్ని తెలుసుకుని ఆచరించడమే నిజమైన సంప్రదాయం.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఆ సమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. ఇదే అంశం ఆయనపై అనర్హత పిటిషన్లకు ప్రధాన కారణంగా మారింది.

దానం నాగేందర్ మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా తన అసలు పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లేనని పిటిషనర్లు వాదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈ అంశంపై న్యాయపోరాటం చేశారు.

స్పీకర్ నిర్ణయంపై హైకోర్టు కీలక తీర్పు

అనర్హత పిటిషన్లను పరిశీలించిన అసెంబ్లీ స్పీకర్ గతంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయడానికి నిరాకరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టి దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవిపై అనర్హతను ప్రకటించింది.

ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు దారి?

హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో ఈ నియోజకవర్గంలో ఉపఎన్నికకు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఉపఎన్నికకు సంబంధించిన తదుపరి ప్రక్రియను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది.

దానం నాగేందర్ కేసుతో పాటు పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కూడా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అయితే వాటిపై ఈరోజు తీర్పు వెలువడలేదు. అందువల్ల దానం నాగేందర్ కేసులో వెలువడిన తీర్పును ఇతర ఎమ్మెల్యేల కేసులకు ముందుగానే వర్తింపజేసినట్లు పేర్కొనడం సరికాదు.

# ఎల్‌నినోతో వర్షాభావం..
# కేంద్ర సాయం కోరిన సీఎం రేవంత్

వర్షపాతం తగ్గిన నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అదే సమయంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా, విద్యుత్ కొరత ఏర్పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర పరిస్థితులపై వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి అవసరమైన కేంద్ర సహకారం అందించాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. తక్కువ నీటి అవసరం ఉన్న, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయగల పంటలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించడం కూడా కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ఆలోచనలో భాగంగా 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించే పంటలకు మెరుగైన మార్కెట్ సదుపాయం కల్పించడం ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు.

మిగిలిన ఇళ్లను కేటాయించాలని వినతి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద రాష్ట్రానికి మొదటి విడతగా 2 లక్షల ఇళ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన గ్రామీణ కుటుంబాలకు పెద్ద సంఖ్యలో ఇళ్ల అవసరం ఉందని వివరించారు.

గత జూలైలో ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రంలోని 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఇప్పటికే మొదటి విడతగా 2 లక్షల ఇళ్లను కేటాయించిన నేపథ్యంలో, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు.

సన్నబియ్యంతో పేదలకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను కూడా ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. సన్న వడ్ల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని వివరించారు.

వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవడంతో పాటు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, మార్కెట్ సదుపాయాల విస్తరణకు కేంద్ర సహకారం అవసరమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన సహాయం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.



# సొంత వార్డుపై దృష్టి పెట్టని చైర్మన్:

## క్యాతనపల్లి 17వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానం



మంచిర్యాల/క్యాతనపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 17వ వార్డులోనే పారిశుద్ధ్యం తీవ్రంగా పడకేసిందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డులోని మురుగు కాలువల చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగినా తొలగించడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం గానీ, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం గానీ చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నిత్యం తడి పొడి చెత్త సేకరించే వాహనం రావడం తప్ప, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి మున్సిపల్ అధికారులు గానీ, చైర్మన్ గానీ రావడం లేదని వాపోయారు. పక్క వార్డుల్లో పనులు జరుగుతున్నా, చైర్మన్ సొంత వార్డులోనే సమస్యలు తిష్టవేయడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో పారిశుద్ధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో 'డ్రై డే' పాటించాలి: డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి

## పార్పెల్లి గ్రామంలో వైద్య శిబిరం.. ఇంటింటికీ తిరిగి రక్త నమూనాల సేకరణ



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పార్పెల్లి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగాల బారిన పడకుండా ముందస్తు నివారణ చర్యలే అత్యుత్తమ మార్గమన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ఖాళీ డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలను ఎప్పటికప్పుడు తొలగించి వారానికి ఒకసారి తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలని కోరారు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని, వేడి నీటినే తాగాలని తెలిపారు. జ్వరం, ఇతర లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ నటరాజ్ గౌడ్, శివకృష్ణ గౌడ్, ఏఎన్ఎంలు కళ్యాణి, వనజ, ఆశా కార్యకర్తలు గంగామణి, పంచాయతీ కార్యదర్శి పి. రాజు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో ఆదివాసీల సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే పాయల్ శంకర్:

## కొమురం భీమ్ కాలనీ వాసులకు పట్టాలు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే



మావల/ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని కొమురం భీమ్ కాలనీ ఆదివాసీల చిరకాల సమస్యలను శాసనసభలో ప్రస్తావించి వారి పక్షాన నిలిచిన స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ చిత్రపటానికి కాలనీవాసులు, తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్, నాయకులు మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా కొమురం భీమ్ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద ఆదివాసీ కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో పాటు విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వైద్యం వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ బలంగా గళమెత్తడం ఎంతో అభినందనీయమన్నారు. ఆదివాసీల ఆత్మబంధువుగా నిలిచిన ఆయనకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషారావు, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం రేణుక, ఉయిక ఇందిర, ఆత్రం గణపతి, వెడ్మ ముకుందరావు, మడావి అనసూయ, మనూకుబాయి, గోవిందరావు, బొజ్జు, మనోహర్, సిడం ప్రభు పాల్గొన్నారు.

# ఏఎంఆర్ టవర్స్‌లో వైభవంగా శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన



నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన పూజా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు సంజయ్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ మండపంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరునికి, గౌరీదేవికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలంతా సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, లోక కళ్యాణం కొరకు కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా సంజయ్ శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మంలో కుంకుమ పూజకు విశిష్ట ప్రాధాన్యత ఉందని, లక్ష్మీస్వరూపమైన కుంకుమతో పూజలు చేయడం వల్ల సమస్త విఘ్నాలు తొలగి సకల శుభాలు చేకూరుతాయని వివరించారు. పూజల అనంతరం మహిళలకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 1.25 లక్షల ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

## పూర్వ విద్యార్థి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఈ. ముత్యం రెడ్డి వితరణ



నిర్మల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన ఆర్ఓ (=ూ) తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తాను చదువుకున్న మాతృ కళాశాల విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో కళాశాల పూర్వ విద్యార్థి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఈ. ముత్యం రెడ్డి రూ. 1,25,000 సొంత నిధులను విరాళంగా వెచ్చించి ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్యం రెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో భాగస్వామిని కావడం ఎంతో గర్వంగా ఉందని, పూర్వ విద్యార్థులంతా ముందుకొచ్చి నేటి తరం విద్యార్థుల సంక్షేమానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత హోదాలో ఉండి కూడా కళాశాలను మరచిపోకుండా ముత్యం రెడ్డి చేసిన ఈ సహాయం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు. గంగాధర్, ఏవో నాగ శ్రీనివాస్, అధ్యాపకులు సూర్యసాగర్, పి.జి. రెడ్డి, కట్టా రమేష్ రెడ్డి, కుంటా శ్రీహరి, తోకల శ్రీనివాస్, సుభాష్, రజిత పాల్గొన్నారు.

# బాసర పుష్కరాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

## హెలిప్యాడ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

బాసర/నిర్మల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): రానున్న గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం బాసర ఆలయ ఈవో కార్యాలయంలో పుష్కర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పుష్కరాల వేళ తరలివచ్చే భక్తుల రద్దీని నియంత్రించేందుకు, వారి సంఖ్యను లెక్కించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. సాధారణ భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, సరిపడా తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర తాగునీరు, రవాణా వసతులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బాసరలో పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ నిర్మాణ ప్రాంతాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, ఈఈలు సుభాష్, సందీప్, అనిల్, ఆలయ ఈవో అంజనీదేవి, తహశీల్దార్ పవన్ చంద్ర పాల్గొన్నారు.



# బీసీల ఆత్మగౌరవ సభ 'అలాయి బలాయి'ని విజయవంతం చేయండి:



నిర్మల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): సెప్టెంబర్ 20 ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న "వెంటాడే కలాలు – వెనుకబడిన కులాలు" రజతోత్సవ బీసీ కులాల అలాయి బలాయి సభను జయప్రదం చేయాలని నిర్మల్ జిల్లా బీసీ రచయితల సమాఖ్య పిలుపునిచ్చింది. శుక్రవారం పట్టణంలోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సభ గోడపత్రికను సమాఖ్య నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు తదితరులు మాట్లాడుతూ.. ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువడిన ఈ కవితా సంకలనం తెలుగు సాహిత్యంలో బీసీ అస్తిత్వవాదానికి బలమైన దిక్సూచిగా నిలిచిందన్నారు. అణచివేతకు గురైన బీసీ సమూహాలు తమ హక్కుల కోసం ప్రశ్నించిన చారిత్రక ఘట్టానికి ఇది ప్రతీక అని కొనియాడారు. ఈ సభకు బీసీ కవులు, రచయితలు, ఆలోచనాపరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నేరెళ్ల హనుమంతు, తొడిశెట్టి పరమేశ్వర్, కామారపు జగదీశ్వర్, కత్రోజు అశోక్ చారి, పోలీస్ భీమేష్, కుమ్మరి నాగారం పాల్గొన్నారు.

# దిమ్మదుర్తిలో కూచాడి శ్రీహరిరావుకు ఘన సన్మానం:

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మామడ, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): మామడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు ముఖ్య అతిథిగా హాజరై కార్డులను అందజేశారు. ఇటీవల వర్షాభావంతో పంటలు ఎండిపోతున్న తరుణంలో ఎస్సారెస్పీ సరస్వతి కాలువకు సాగునీరు విడుదల చేయించి రైతాంగాన్ని ఆదుకున్నందుకు గాను దిమ్మదుర్తి గ్రామస్తులు, రైతులు శ్రీహరిరావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# 28వ ప్యాకేజీకి రూ. 500 కోట్ల నిధులు ఇవ్వాలి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

- అసంపూర్తి ప్రాజెక్టులతో 50 వేల ఎకరాలకు అందని సాగునీరు
- పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్ సరఫరాకు రూ. 2.20 కోట్లు తక్షణమే విడుదల చేయాలి

ముధోల్/హైదరాబాద్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):



ముధోల్ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూపకల్పన చేసిన 28వ ప్యాకేజీ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ. 500 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల పెండింగ్ నిధులపై ప్రభుత్వాన్ని నిలదీశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ముధోల్ నియోజకవర్గ రైతాంగం ఎంతో విలువైన భూములను త్యాగం చేసినప్పటికీ, నేటికీ ఈ ప్రాంతానికి సాగునీరు అందకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 28వ ప్యాకేజీ పనులకు నిధులు కేటాయిస్తేనే ఈ ప్రాంత అన్నదాతల కష్టాలు తీరతాయన్నారు. అలాగే రూ. 80 కోట్లతో నిర్మాణం పూర్తయిన పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ కోసం రూ. 2.20 కోట్ల నిధులు అవసరమని, వీటిని విడుదల చేస్తే మరో 5 వేల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని సభ దృష్టికి తెచ్చారు.

# పాలజ్ గణపతి దర్శనానికి బోరెగాం యువకుల 11వ పాదయాత్ర

ముధోల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):



మండలంలోని బోరెగాం గ్రామ యువకులు ప్రముఖ పుణ్యక్షేత్రమైన పాలజ్ గణపతి దర్శనార్థం శుక్రవారం 11వ పాదయాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గత పదేళ్లుగా ఆనవాయితీగా వస్తున్న ఈ భక్తి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ యువత కాలినడకన బయలుదేరారు. గ్రామ సర్పంచ్ కిష్టయ్య పాదయాత్ర బృందానికి స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం 'జై గణేశా' నామస్మరణతో గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వామివారి దర్శనం కలగాలని ఆకాంక్షించారు. ఈ పాదయాత్రలో ఎర్రం సాయిబాబా, పుదరి దేవన్న, శ్రీను, సాయి, మహేష్, భోజన్న మరియు గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అష్టావధాన బంధువు పురస్కార గ్రహీత పీసర శ్రీనివాస్ గౌడ్‌కు సన్మానం

ముధోల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):



శ్రీ హంసవాహిని సాహిత్య కళాపీఠం నిర్వహించిన లఘు అష్టావధానంలో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక 'అష్టావధాన బంధువు' పురస్కారం పొందిన చించాల గ్రామ సాహితీవేత్త, జర్నలిస్ట్ పీసర శ్రీనివాస్ గౌడ్‌ను శుక్రవారం ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి సాహితీ, జర్నలిజం రంగాల్లో సేవలందిస్తూ ఉన్నత పురస్కారాలు పొందడం గర్వకారణమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సాయి సువర్ధన్, డాక్టర్ మల్లికార్జున్, నర్సింగ్ ఆఫీసర్ సరోజన, సిబ్బంది లాలయ్య, లక్ష్మి, కల్పన, పద్మ, పరమేష్, ఆరోగ్యమిత్ర స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ఆటపాటలతోనే పూర్వ ప్రాథమిక విద్యార్థులకు బోధన: డీఈవో దర్శనం భోజన్న

## ప్రీ-ప్రైమరీ అడ్మిషన్లలో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా ప్రథమం.. ఇన్స్ట్రక్టర్లకు ప్రశంసలు

నిర్మల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):




చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటల ద్వారా చదువును నేర్పిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) దర్శనం భోజన్న సూచించారు. ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు పాఠశాల అంటే భయం లేకుండా ఆకర్షణీయమైన రీతిలో బోధన సాగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతుల్లో విద్యార్థుల నమోదును మరింత పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు విద్యార్థుల నమోదులో తెలంగాణ రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. పూర్వ ప్రాథమిక విద్యను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న ఇన్స్ట్రక్టర్లను డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు గోపాల్, ప్రవీణ్ మరియు ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# బోరిగాంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న గణనాథుని నవరాత్రి పూజలు

ముధోల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని బోరిగాం గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ కిష్టయ్య స్థానిక యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి మండపాలను సందర్శించి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రధాన మండపాలన్నీ భక్తి సంగీతాలు, హారతులతో మారుమోగుతున్నాయి. గ్రామ యువత, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. పలు మండపాల వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు చేపట్టడంతో బోరిగాంలో పండుగ శోభ వెల్లివిరిసింది.



# నిర్మల్ కర్ర వినాయకుడి వద్ద వైభవంగా పూజలు:

# నేడు యజ్ఞం, సోమవారం సత్యనారాయణ వ్రతాలు

నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):



వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలో ప్రతిష్ఠించిన ప్రముఖ కర్ర వినాయకుడి ప్రాంగణంలో శుక్రవారం మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం ఆలయ ప్రాంగణంలో విశేష యజ్ఞ కార్యక్రమం, అలాగే సోమవారం భక్తుల సౌకర్యార్థం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వ్రతాల్లో పాల్గొనగోరే భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్ర పారిశ్రామిక సంఘం గౌరవ అధ్యక్షుడు చిలమంతుల రాజలింగం, అధ్యక్షుడు కొమ్మోజి నారాయణ, ప్రధాన కార్యదర్శి కాసర్ల చంద్రశేఖర్, కోశాధికారి పాంచాల్ గంగాప్రసాద్, కర్ర సంఘం సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రబింద్ర పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

.ముధోల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):




నిర్మల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాల కార్యక్రమంలో మండల కేంద్రమైన ముధోల్‌లోని రబింద్ర పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్నందుకు గాను ఆయనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేశారు. అవార్డును అందుకున్న ప్రతాప్‌ను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో), మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో), ట్రస్ట్ సభ్యులు, వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# సోన్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఎంపీవో గోవర్ధన్ ఆకస్మిక తనిఖీలు

సోన్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సోన్ మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలను మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) గోవర్ధన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రమైన సోన్‌తో పాటు కడ్తాల్, గంజాల్, మాదాపూర్ గ్రామ పంచాయతీలను సందర్శించి పంచాయతీ రికార్డులను, నిధుల వినియోగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. గంజాల్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన కమ్యూనిటీ ఇంకుడు గుంత (సోక్ పిట్)ను, బోర్‌వెల్ రీఛార్జి వాటర్ స్ట్రక్చర్ నిర్మాణాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ రాము, గంజాల్ సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు సుమయ్య, రాణి వర్మ, జయలక్ష్మి, నగేష్ కుమార్ పాల్గొన్నారు.



# ఫ్యూచర్ పాఠశాల ఉపాధ్యాయురాలు గాయత్రికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ముధోల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):




నిర్మల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ముధోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామంలోని ఫ్యూచర్ పాఠశాల ఉపాధ్యాయురాలు గాయత్రి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో అంకితభావంతో పనిచేస్తున్న ఆమె సేవలను గుర్తించి ఈ గుర్తింపునిచ్చారు. పురస్కారం అందుకున్న గాయత్రిని జిల్లా విద్యాశాఖాధికారి, ఎంఈవో, అవార్డు ట్రస్ట్ ప్రతినిధులు మరియు పాఠశాల కరస్పాండెంట్లు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER

# యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా!

నిర్మల్ సెప్టెంబర్ తెలంగాణ వెన్నెల వాక్కు

నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఉచిత ఇసుక విధానం మరియు ప్రభుత్వ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇసుక మాఫియా అడ్డగోలుగా రెచ్చిపోతోంది. నిర్మల్ పట్టణానికి కేవలం రెండు కిలోమీటర్ల స్వల్ప దూరంలో ఉన్న చిట్యాల వాగు ఇసుక అక్రమార్కులకు నిరంతర సంపాదనను ఇచ్చే కామధేనువుగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు ఈ వాగులో దిగి ఇసుకను తోడేస్తున్నాయి.

**కళ్లెదుటే దోపిడీ -- కరువైన పర్యవేక్షణ:**
ఏకంగా జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే ఈ అక్రమ రవాణా పహాడీ స్థాయిలో జరుగుతున్నప్పటికీ, సంబంధిత యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే ప్రధాన రహదారి పక్కనే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక భారీ స్థాయిలో 'మామూళ్లు' నడుస్తున్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అధికారుల ఈ ఉదాసీనతను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు లక్షలాది రూపాయల అక్రమ సంపాదనను ఆర్జిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు.

**గ్రామాల వారీగా అక్రమ డంపింగ్ కేంద్రాలు:**
ఇసుక మాఫియా కేవలం వాగు నుండి తోడటంతోనే ఆగడం లేదు. అధికారుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి, అలాగే భవిష్యత్తులో కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయించడానికి పరిసర గ్రామాలను అక్రమ నిల్వ కేంద్రాలుగా (డంపింగ్ యార్డులుగా) మార్చేశారు. చిట్యాల వాగు నుంచి ఇసుకను తరలించి మంజులాపూర్ చివరి ప్రాంతం, తాంసి, జఫ్లాపూర్, వెంగపేట్, ఆలూర్ వంటి గ్రామాల్లో పెద్ద ఎత్తున డంపింగ్ చేస్తున్నారు. పగటిపూట రహస్యంగా నిల్వ చేసి, రాత్రి వేళల్లో, అనుకూల సమయాల్లో వినియోగదారులకు తరలిస్తున్నారు.

**ట్రాక్టర్ ట్రిప్పుకు రూ. 10 వేల వరకు వసూలు:**
సొంతంగా ఒక చిన్న ఇల్లు నిర్మించుకోవాలని భావించే సామాన్య గృహ నిర్మాణదారులు, పేద ప్రజలు ఇసుక దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అవకాశంగా భావిస్తున్న అక్రమార్కులు సాధారణ ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని విపరీతంగా దోపిడీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో తక్కువ ధరకు లభించాల్సిన ఒక ట్రాక్టర్ షిఫ్ట్ (ట్రిప్పు) ఇసుకను రూ. 8,000 నుంచి రూ. 10,000 వరకు విక్రయిస్తూ అడ్డగోలు లాభాలు గడిస్తున్నారు. రేటు అడిగితే "మాకు పైస్థాయి వరకు ఖర్చులు ఉంటాయి" అని సమాధానం ఇస్తూ ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు.

**పర్యావరణానికి విఘాతం -- అధికారుల స్పందన కరువు:**
వాగుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వడం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్లు వట్టిపోతుండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. ఇసుక రవాణా చేసే భారీ వాహనాల వల్ల గ్రామీణ రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

**రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు**
ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే చిట్యాల వాగుతో పాటు మంజులాపూర్, తాంసి, జఫ్లాపూర్, వెంగపేట్, ఆలూర్ గ్రామాల్లో ఉన్న అక్రమ డంపింగ్‌లపై దాడులు చేసి ఇసుకను సీజ్ చేయాలని, ఇసుక మాఫియాపై కఠినమైన పిడి యాక్ట్ కేసులు నమోదు చేసి భావి తరాలకు పర్యావరణాన్ని కాపాడాలని నిర్మల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ముధోల్‌లో వినాయక నిమజ్జనానికి 200 మందితో భారీ బందోబస్తు: ఏఎస్పీ సాయికిరణ్



ముధోల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు భైంసా ఏఎస్పీ సాయికిరణ్ తెలిపారు. ఆదివారం జరగనున్న శోభాయాత్ర మార్గాలను సీఐ రవీందర్ నాయక్, ఎస్సై బిట్ల పెర్సిస్‌లతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలను డీఎస్పీలు, సీఐలు, ప్రత్యేక పోలీసు బలగాలు పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. మండపాల నిర్వాహకులు నిర్ణీత గడువులోగా నిమజ్జనాలు పూర్తి చేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణలో వెదురు ఉత్పత్తుల పాత్ర విశిష్టం:



నిర్మల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో వెదురు మొక్కలు, వెదురు ఉత్పత్తులు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ మేదరి వృత్తిని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విస్తరించుకోవాలని సూచించారు. వెదురు ఉత్పత్తుల ప్రోత్సాహం ద్వారా అటు పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ చేతివృత్తుల వారికి ఆర్థిక స్వావలంబన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, జిల్లా మేదర సంఘం ప్రధాన కార్యదర్శి ఊరె దశరథ్, ప్రతినిధులు దూడ ప్రమోద్, ఎనుగందుల రాజేందర్, కనికరం శేఖర్ పాల్గొన్నారు.

## స్థానిక కళాకారులను ఆదరించాలి: 'కాగితపు పడవలు' చిత్ర బృందం విజ్ఞప్తి




నిర్మల్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పరిసర ప్రాంతాల్లో స్థానిక నటీనటులతో తుకారం దర్శకత్వంలో తెరకెక్కిన "కాగితపు పడవలు" చలనచిత్రాన్ని స్థానిక ప్రజలు ఆదరించాలని చిత్ర యూనిట్ కోరింది. శుక్రవారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో చిత్ర నటీనటులు విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ కలిగిన కళాకారులు ఉన్నారని, వారికి ప్రోత్సాహం లభిస్తే చిత్రసీమలో మరింత రాణిస్తారన్నారు. స్థానికంగా చిత్రీకరించిన ఈ చిత్రం నిర్మల్‌లోని తిరుమల థియేటర్‌లో విడుదలైందని, ప్రజలంతా థియేటర్‌కు వెళ్లి వీక్షించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కళాకారులు జబర్దస్త్ పులి, పి. మోహన్‌రావు, రాజన్న, లక్ష్మీకాంత్, గంగాప్రసాద్, రాకేష్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వెలికితీయడమే జర్నలిస్టుల అసలైన కర్తవ్యం: దుస్స శివప్రసాద్




రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సమాజంలోని అణగారిన వర్గాల ప్రజా సమస్యలను వెలికితీసి పాలకుల దృష్టికి తీసుకెళ్లడమే రిపోర్టర్ల అసలైన వృత్తి ధర్మమని రవీంద్రఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దుస్స శివప్రసాద్ అన్నారు. రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిజాయితీగా వార్తలు రాసినప్పుడే ప్రభుత్వాలు స్పందించి పరిష్కరిస్తాయన్నారు. క్లబ్ నిబంధనలను సభ్యులంతా కట్టుదిట్టంగా పాటించాలని సూచించారు.

## నా జీవితం తెరిచిన పుస్తకం.. భూములు చూసేందుకు ఇంత హంగామా ఎందుకు?

సిద్దిపేట: తన భూములు, తోటలను పరిశీలించేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్దిపేటకు వస్తున్నారన్న అంశంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్లలోనే బహిరంగంగా వెల్లడించానని, దాచాల్సిందేమీ లేదని స్పష్టం చేశారు. తన జీవితం తెరిచిన పుస్తకమని పేర్కొంటూ.. భూములు చూసేందుకు ఇంత హంగామా, పోలీసు బందోబస్తు ఎందుకని ప్రశ్నించారు.
కాంగ్రెస్ నాయకులు తన భూములను చూసేందుకు వస్తున్నారని చెబుతూ మూడు జిల్లాల నుంచి దాదాపు 3 వేల మంది పోలీసులను రప్పించడం, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, రోప్ పార్టీలు, డ్రోన్ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు చేయడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. భూములు, తోటలు చూడటానికే ఇంతటి ఆర్భాటం ఎందుకని వ్యాఖ్యానించారు.
"నేరుగా నా ఇంటికి వస్తే.. నేనే కడుపునిండా భోజనం పెట్టి, దగ్గరుండి నా తోటకు తీసుకెళ్లి చూపిస్తా. ఇంతమంది పోలీసులు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, డ్రోన్ కెమెరాలతో రావాల్సిన అవసరం ఏముంది?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

అసత్య ప్రచారాలు మానండి

ప్రజలకు అసత్య ప్రచారాలు చేయకుండా ఉన్నది ఉన్నట్లుగా వాస్తవాలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులకు హరీశ్‌రావు సూచించారు. రాజకీయ విమర్శల పేరుతో తనపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తన ఆస్తులకు సంబంధించిన వివరాలను ఎప్పటి నుంచో బహిరంగంగానే వెల్లడిస్తున్నానని తెలిపారు.

అఫిడవిట్లలో పూసగుచ్చినట్లు వివరాలు

2018, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సమర్పించిన నామినేషన్ అఫిడవిట్లలో తనకు ఉన్న భూముల వివరాలను, సర్వే నంబర్లతో సహా స్పష్టంగా పేర్కొన్నట్లు హరీశ్‌రావు తెలిపారు. 2018లో తనకు 8 ఎకరాల భూమి ఉండగా, 2023 నాటికి 13 ఎకరాలకు చేరిందని చెప్పారు. ఆ భూమిని తాను చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.
తన ఆస్తుల విషయంలో దాచాల్సిందేమీ లేదని, ఎన్నికల అఫిడవిట్లలోనే అన్ని వివరాలు నమోదు చేశానని స్పష్టం చేశారు. తన జీవితానికి సంబంధించిన విషయాలు బహిరంగంగానే ఉన్నాయని, తన జీవితం తెరిచిన పుస్తకమని వ్యాఖ్యానించారు.

ఎవరి భూములూ కబ్జా చేయలేదు

తాను ఎవరి భూములను కబ్జా చేయలేదని, ప్రజల సొమ్మును దోచుకోలేదని హరీశ్‌రావు అన్నారు. తనపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. తన నిబద్ధత, కష్టపడే తత్వం, పనితీరును సిద్దిపేట ప్రజలు గుర్తించారని చెప్పారు. అందుకే తనను ఏడుసార్లు ఘనంగా గెలిపించారని హరీశ్‌రావు పేర్కొన్నారు.
తన భూముల విషయంలో ఎలాంటి అనుమానాలున్నా బహిరంగంగా వివరాలు పరిశీలించుకోవచ్చని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే ముఖ్యమని ఆయన అన్నారు. రాజకీయ ఆరోపణల కంటే వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు.

## ఫార్ములా-ఈ కేసు.. నాంపల్లి కోర్టుకు కేటీఆర్

ఫార్ములా-ఈ రేసు నిర్వహణకు సంబంధించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి సుమారు రూ.55 కోట్లు బదిలీ చేసిన వ్యవహారంపై ఏసీబీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అవసరమైన అనుమతులు, ఆర్థిక విధానాలను పాటించకుండా నిధుల బదిలీ జరిగిందన్నది దర్యాప్తు సంస్థ ఆరోపణ. ఈ ఆరోపణల ఆధారంగానే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.
కేటీఆర్ సహా నిందితులపై ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిశీలించిన అనంతరం ప్రత్యేక కోర్టు కేసును పరిగణనలోకి తీసుకుని నిందితులకు సమన్లు జారీ చేసింది. గత విచారణకు వ్యక్తిగత కారణాలతో కేటీఆర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 18న కోర్టుకు హాజరయ్యారు.
కోర్టు వద్ద కేటీఆర్ రాక సందర్భంగా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, నేటి విచారణ అనంతరం కొన్ని నిందితులు/సంబంధిత సంస్థలు హాజరు కాకపోవడంతో కేసు విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేసినట్లు సమాచారం. ఈ కేసులో ఏసీబీ చేసిన ఆరోపణలు ప్రస్తుతం న్యాయపరిశీలనలో ఉన్నాయి. ఆరోపణలు కోర్టులో రుజువైనట్లుగా పరిగణించరాదు.

## భైంసా విద్యుత్ గణేష్ మండలిలో రూ. 37 వేలు పలికిన లడ్డూ: మొత్తం రూ. 53,200 ఆదాయం



భైంసా, సెప్టెంబర్ 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భైంసా పట్టణంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో కొలువైన "విద్యుత్ గణేష్ మండలి"లో శుక్రవారం నిర్వహించిన స్వామివారి ప్రసాదాల వేలంపాటకు విశేష స్పందన లభించింది. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ వేలంలో కుబీర్ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్ పుండలిక్ గణపతి లడ్డూను రూ. 37,000కు దక్కించుకున్నారు. అలాగే స్వామివారి నోట్‌బుక్ మరియు పెన్‌ను ముధోల్ లైన్‌మన్ జగదీష్ రూ. 13,100కు, గణపతి కండువాను కుబీర్ లైన్‌మన్ దేవిదాస్ రూ. 3,100కు వేలంలో సొంతం చేసుకున్నారు. మొత్తం వేలం ద్వారా మండలికి రూ. 53,200 సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగులు విధులతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ సమైక్యతను చాటడం అభినందనీయమన్నారు.